122

# గాలి గోపురం

- జలదంకి సుధాకర్

## ఎపిసోడ్ - 1

మొదటి దృశ్యం:

దేవాలయంలో ధ్వజస్తంభానికి కాళ్లు ఆనించి పడుకొన్న ఒక ఆగంతకుడిని చూశారు పరమేశ్వర శాస్త్రి అనే అర్చకుడి భార్య గాయత్రి, అక్కడ పని చేస్తున్న కాళిదాసు. తండ్రి పూజకు పువ్వులను కోసి తెమ్మని కొడుకు ఫణిని అడుగుతుంది గాయత్రి. పరమేశ్వర శాస్త్రి పూజకోసం గుళ్లోకి వచ్చాడు. అక్కడ పడుకొని వున్న మనిషిని నిద్రలేపి అతనిపేరు ఖాసిం అనీ ఉద్యోగం కోసం ఇల్లు వదిలి బయలు దేరానని చెబుతాడు ఆగంతకుడు. శాస్త్రి అతని మీద జాలితో ఆ గుళ్లోనో పనీ పాటా చేసుకుంటూ వుండమంటాడు. భార్య గాయత్రి అందుకు అభ్యంతరం చెప్పినా శాస్త్రి పట్టించుకోలేదు.

రెండో దృశ్యం:

పూలు కోసుకురావడానికి వెళ్లిన ఫణిని పాము కరుస్తుంది. కుర్రవాడు నురగలు కక్కుతూ పడిపోయాడు. డాక్టర్ కోసం కబురు చేస్తూ వుండగా ఖాసిం ఆ కుర్రవాడి దగ్గరకు వెళ్లి లోపలి విషాన్ని నోటితో లాగి కుర్రవాడు మామూలు మనిషి అయ్యేటట్లు చేస్తాడు.

గాయత్రి కృతజ్ఞతలతో తాను యింతకు ముందు అన్న మాటలను పట్టించుకోవద్దని, శివుడే ఈ రూపంలో వచ్చి తన కొడుకును కాపాడాడని, అతనిని ఎక్కడికీ వెళ్లకుండా అక్కడనే తమతోనే ఉండి పొమ్మని కోరుతుంది. ఖాసిం అక్కడే ఉండిపోయాడు.

మూడో దృశ్యం:

ఖాసిం మంత్రపుష్పం నేర్చుకున్నాడు. శాస్త్రిగారి కుటుంబంలో ఒక సభ్యుడైనాడు. కాళిదాసు, గాయత్రి అతనితో దేవుణ్ణి గురించి మాట్లాడుతారు.

ధర్మకర్త వీరాస్వామి రంగ ప్రవేశంతో వాళ్ల జీవితాలు దుఃఖమయం అయ్యాయి. గుళ్లో కొత్త మనిషిని చూసి అతని ఆనుపానులు ఆరా తీస్తాడు. అతన్ని తమ నుంచి దూరంగా తీసుకు వెడతాడేమోనని భయపడి అతని పేరు కాశీ విశ్వనాథ్ అని చెబుతుంది గాయత్రి.

శాస్త్రి, వీరాస్వామి రాబోయే ఉత్సవాలను గురించి వాదులాడుకుంటారు.

ఖాసిం పనిపాటలు చూసి తాను యింకా ఎక్కువ డబ్బు యిస్తానని, తన దగ్గర పని చెయ్యమని వీరాస్వామి అతనిని తన వైపుకు లాక్కొనే ప్రయత్నం చేస్తాడు. అటువంటి పనులు తాను చేయనంటాడు. తన మాట నెగ్గక పోవడంతో ఏ విధంగానైనా శాస్త్రిని ఆ పూజారి పదవి నుంచి తప్పించి తనవాడైన సదాశివాన్ని పూజారిగా చేరుస్తానని వీరాస్వామి సవాలు చేస్తాడు.

## ఎపిసోడ్ - 2

నాలుగో దృశ్యం:

ఖాసిం తన భార్యా బిడ్డల్ని చూడడానికి తన వూరు వెళ్లి వస్తానంటాడు. నువ్వు వెళ్లనక్కరలేకుండానే వాళ్లకు 500 రూపాయలు తాను పంపానంటాడు శాస్త్రి. ఎమ్.ఓ. రసీదు కూడా వచ్చిందని చెబుతుంది గాయత్రి. కాని ఆ రసీదుమీద తన భార్య సంతకం కాక మరెవరిదో ఉందంటాడు శాస్త్రి. నూర్జహాన్‌కు బదులు రియాజ్ ఖాన్ అని సంతకం చేసి వుంది రసీదు మీద. ఖాసిం దానిని చూసి కూడా ఏమీ మాట్లాడడు.

పరమేశ్వర శాస్త్రి ఉత్సవాలకు కావలసిన సామగ్రిని సమకూర్చడానికి ఊళ్లోకి వెడతాడు.

వీరాస్వామి వచ్చాడు, ఎవరో కొత్త మనిషిని వెంటబెట్టుకొని.

ఐదో దృశ్యం:

ఆ మనిషిని గుర్తు పట్టావా అని వీరాస్వామి ఖాసింను అడిగాడు. తానెవరో తెలుసుకున్నానని అందుకే అవసరమైన పని చేశానని వీరాస్వామి అంటాడు. హిందువుల గుడిలో ఎందుకు పని చేస్తున్నావని రియాజ్ ఖాసింను ప్రశ్నిస్తాడు. అందరు దేవుళ్లు ఒకటే నంటాడు ఖాసిం. రియాజ్ ఖాసింతో వాగ్వివాదానికి దిగి, తన గ్రామంలోని మసీదు ముల్లాగా తాను చేసిన పాపకార్యానికి తగిన మూల్యం చెల్లించి ప్రాయశ్చిత్తం చేసుకోమంటాడు. అంతవరకు ఖాసింను, అతని కుటుంబాన్ని ఊరినుంచి వెలివేస్తున్నానంటాడు. ఒక వారం లోగా ఖాసిం ఈ విధంగా చేయాలని ఆదేశిస్తాడు.

ఆరో దృశ్యం:

పరమేశ్వర శాస్త్రి వీరాస్వామికి ఎదురు నిలిచి తాను చేసింది భగవంతుడు మెచ్చినపని అనీ, వీరాస్వామి చేస్తున్నది నీచమనీ నిందిస్తాడు. ఆకలి నుంచి ఒక మనిషిని తాను రక్షించానని, అందుకే అతనికి పని, పాట కల్పించానని, మనిషి చేయవలసిందే తానూ చేశానని చెబుతాడు.

ఒక మహమ్మదీయుణ్ణి గుడిలో ప్రవేశపెట్టినందుకు శాస్త్రి గుడిలో పూజారి పదవిని వదులుకోవాలని, ఉన్న ఇంటిని ఖాళీ చేసి గుడి వదిలి పోవాలని ఆదేశిస్తాడు వీరాస్వామి.

గాయత్రి ఈ నిర్ణయానికి బాధపడుతుంది. కంటనీరు పెడుతుంది. శాస్త్రి ఆ సంక్షోభానికి తల్లడిల్లి పోతాడు. అతను పడిపోతాడు. కాలు, చెయ్యి పని చేయవు. శాస్త్రిగారు అనారోగ్యంతో వున్నా గుళ్లో పూజలు ఆగవంటాడు ఖాసిం. ఫణి పూజ చేస్తాడని, తాను మంత్రాలు చదువుతానని చెప్పి అభిషేకం చేయిస్తాడు. అందుకు అర్హుడు కావడానికి ఫణికి ఉపనయనం కూడా తానే చేయిస్తాడు ఖాసిం.

ఏడో దృశ్యం:

వీరాస్వామికి ఈ సంగతి తెలిసి కోపంతో మండి పడుతూ గుళ్లోకి వచ్చాడు. తనకు కాలు చెయ్యి పని చేయకపోయినా శాస్త్రి కుంటుకుంటూ వచ్చి శాస్త్రాలలో ఎక్కడా యిటువంటి నిషేధం విధించలేదని ఖాసిం మంత్రాలు చదవడం నేరం కాదని వాదిస్తాడు. ఒక అవిటి మనిషికి సహాయంగా ఉండడం తప్పా - అని ఆక్రోశిస్తుంది గాయత్రి. ఆమె రియాజ్‌తో అచ్చమైన ఉర్దూ భాషలో అతను చేసిన పని ఎంత నీచమైనదో చెబుతుంది. తమ అల్లా ఇది మెచ్చడంటుంది. కాళిదాసు కూడా మానవతా కారుణ్యం మతం కన్న గొప్పదంటాడు. వాళ్లు పోట్లాటకు దిగుతారు. రియాజ్ ఖాసింను కొట్ట బోతూ వుండగా ఫణి వాళ్ల మధ్యకు వెడతాడు. అతనికి బలంగా దెబ్బలు తగిలాయి. ఖాసిం ఆ పిల్లవాడిని భుజం మీద వేసుకొని వెడుతూ రియాజ్‌తో అతని వంటి వాళ్లు మతంకోసం మానవత్వాన్ని మంట గలిపితే తాను మానవత్వం కోసం మతాన్ని పక్కన పెడుతున్నానని చెప్పి వెళ్లి పోతాడు.